


అరసవల్లికి రూ.9.75 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వైశాఖ మాసం ఆదివారం కావడంతో అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి సందర్శకుల తాకిడి పెరిగింది. జిల్లావాసులే కాకుండా దూర ప్రాంతాల నుంచీ పలువురు యాత్రికులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. యాత్రికుల తాకిడి పెరగడతో ఆలయానికి ఆదాయం కూడా పెరిగింది. ఒక్క ఆదివారం నాడే టిక్కెట్ల రూపంలో రూ.6,09,300, విరాళాల రూపంలో రూ.95,201, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2,71,405 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.

ఫీ'జులుం'

● వేళ్లూనుకుంటున్న విద్యా వ్యాపారం ● ఇష్టారాజ్యంగా ఫీజుల వసూలు



కార్పొరేట్ విద్య... అత్యుత్తమ విద్య... నాణ్యమైన విద్య... పేరేదైనా అంతిమ లక్ష్యం విద్యా వ్యాపారమే. జిల్లాలో ఇప్పుడు అక్షరాలా అదే జరుగుతోంది. పలు రకాల పేర్లతో విద్యా వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వేళ్లూనుకుంటోంది. గతంలో జిల్లా కేంద్రానికే పరిమితమైన పలు కార్పొరేట్ పాఠశాలలు నేడు మండల కేంద్రాలకూ విస్తరించాయి. ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలకూ సరితూగని కొన్ని పాఠశాలలూ అనధికారికంగా టెక్నో, ఇ-టెక్నో, కాన్సెప్ట్, ఐఐటి తదితర పేర్లతో ఫీజుల వసూళ్లలో మాత్రం ముందుంటున్నాయి. కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల ఫీజుల వసూళ్లకు అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒలేవీ అమలుకు నోచుకోవడం లేదు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం, ఇచ్ఛాపురం

తిమ్మిని బమ్మి, బమ్మిని తిమ్మి చేయడంలో కార్పొరేట్, కొన్ని ప్రయివేటు విద్యాసంస్థలు ఆరితేరాయి. ఆయా పాఠశాలల్లో సాధిస్తున్న ఫలితాల మాట ఎలా ఉన్నా కరపత్రాలు, బ్రోచర్లు, ప్రకటనల ద్వారా వారు చేస్తున్న ప్రచార పటోపానికి విద్యావంతులైన తల్లిదండ్రులూ మోసపోతున్నారంటే, ఆ ప్రచారం ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రచార భ్రమలో పడి ప్రభుత్వ పాఠశాలల్లో సాధిస్తున్న ఫలితాలను పక్కన పడేసి, కార్పొరేట్ పాఠశాలల వైపు తాహతుకు మించి పరుగులు తీస్తున్నారు. ఈ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థుల సంఖ్యను పరిశీలిస్తే తక్కువే. మెరుగైన ఫలితాలు సాధించని విద్యార్థులే ఎక్కువగా ఉంటారు. ఉత్తమ ఫలితాలు సాధించిన అరకొర విద్యార్థులనే ఆయా పాఠశాలలు ప్రచారాలకు వాడుకుంటున్నాయి. ఈ హంగూ, ఆర్భాటాలను ఏమాత్రం పట్టించుకోని తల్లిదండ్రులు ఈ విద్యాసంస్థల మోజులో పడి జేబులు ఖాళీ చేయించుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని అర్హతలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యను బోధిస్తూ, ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నారు. ఇవే అర్హతలు కార్పొరేట్ పాఠశాలల్లో పరిశీలిస్తే ఎక్కడో తప్ప మచ్చుకైనా కనిపించవు.

ఇష్టారాజ్యం

జూన్ 12వ తేదీ నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించాయి. విద్యార్థుల వేట కోసం మండుటెండలోనూ గడప గడపా తొక్కుతున్నాయి. వేసవి సెలవుల్లో అడ్మిషన్లు చేపట్టరాదని నిబంధనలున్నా, ఎవరూ పట్టించుకోలేదు. వీటికితోడు ఆ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు 2012 జూలై 30వ తేదీన ప్రభుత్వం జిఒ నంబరు 42ను జారీ చేసింది. దీని ప్రకారం ఆయా విద్యాసంస్థలు కల్పించే సౌకర్యాలను బట్టి అర్బన్ పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యకు విద్యార్థుల నుంచి నెలకు రూ.750, ఏడాదికి రూ.తొమ్మిది వేల లోపు వసూలు చేయాలి. రూరల్ పరిధిలో నెలకు రూ.650, ఏడాదికి రూ.7,800లోపు వసూలు చేయాలి. హైస్కూల్ విద్యకు అర్బన్ పరిధిలో నెలకు రూ.వెయ్యి, ఏడాదికి రూ.12వేల లోపు వసూలు చేయాలి. రూరల్ పరిధిలో నెలకు రూ.900, ఏడాదికి రూ.10,800 లోపు వసూలు చేయాలి. ఈ నిబంధనలు మచ్చుకైనా కనిపించడం లేదు.

అమలుకు నోచని జిఒలు

జిల్లాలో సుమారు 3.50 లక్షల మంది విద్యార్థులు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ విద్య నభ్యసిస్తున్నారు. జిల్లాలో సుమారు 450 వరకు కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలు ఉంటే, సుమారు 80 వరకు గుర్తింపు లేని పాఠశాలలు ఉన్నాయి. కొన్ని పాఠశాలలు ఐదో తరగతి వరకు అనుమతులుంటే, ఏడో తరగతి వరకు బోధిస్తున్నాయి. మరికొన్ని పాఠశాలలు ఏడో తరగతి వరకు అనుమతులుంటే, పదో తరగతి వరకు బోధిస్తున్నాయి. ఇలాంటి విద్యాసంస్థల్లోనూ ఫీజులు చుక్కలు చూపిస్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రవేశ పరీక్షలు, అడ్మిషన్ల పేరుతో వసూలు చేస్తున్న ఫీజులే కాక బస్సు, దుస్తులు, బూట్లు, పుస్తకాలు... ఇలా చెప్పుకుంటూ పోతే ఆ జాబితా చాంతాడంత ఉంటుంది. వీటి కోసం వేలకు వేల రూపాయలు తల్లిదండ్రుల నుంచి అప్పనంగా గుంజుతున్నారు.

కొరడా ఝుళిపిస్తారా..?

కార్పొరేట్ పాఠశాలల పరిస్థితి అయితే ఇక చెప్పాల్సిన అవసరమే లేదు. ఏడో తరగతికే ఏడాదికి సుమారు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ వసూలు చేస్తున్నాయి. ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మాత్రం కనిష్ట స్థాయిలో జీతాలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నాయి. కుటుంబ పోషణకే జీతాలు చాలడం లేదని, పెంచాలని ఉపాధ్యాయులు ఒత్తిడి తెస్తే, వారిని తొలగించిన సందర్భాలు కోకొల్లలు. దీంతో మిగిలిన వారు నోరెత్తలేక ఇచ్చిందే మహా ప్రసాదంగా సరిపెట్టుకొని మిన్నకుంటున్నారు. నిబంధనలు పాటించని ప్రయివేటు పాఠశాలలను మూసివేసే ప్రయత్నం ప్రభుత్వం చేయడం లేదు. ఈ విద్యా సంవత్సరంలోనైనా ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని, ఫీ'జులుం'పై విద్యాశాఖాధికారులు కొరడా ఝుళిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఆ దిశగా అధికార యంత్రాంగం కదులుతుందో, లేదో ఆచరణలో చూడాల్సి ఉంది.

నాడు తండ్రి... నేడు తనయుడు

● కేంద్రమంత్రిగా రామ్మోహన్ నాయుడు ప్రమాణ స్వీకారం
● జిల్లా నుంచి మూడో వ్యక్తిగా చోటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, టెక్కలి

కేంద్ర మంత్రిగా ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న టిడిపికి రెండు మంత్రి పదవులు లభించగా, అందులో కేబినెట్ హోదా ఉన్న మంత్రి పదవి రామ్మోహన్ నాయుడును వరించిన విషయం విదితమే. యువత, సామాజిక తరగతి, పార్టీ విధేయత వంటి సమీకరణాల నేపథ్యంలో రామ్మోహన్ నాయుడును ఈ పదవి వరించింది. రామ్మోహన్ నాయుడు తండ్రి కీర్తిశేషులు కింజరాపు ఎర్రన్నాయుడు యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా పనిచేశారు. ఇప్పుడు ఆయన తనయుడూ మంత్రి పదవి చేపట్టడంతో తండ్రీ తనయులిద్దరూ కేంద్రమంత్రులుగా పనిచేసిన రికార్డును సొంతం చేసుకున్నారు. జిల్లా నుంచి కేంద్రమంత్రులుగా ఇప్పటివరకు కీ.శే ఎర్రన్నాయుడు, కిల్లి కృపారాణి పనిచేయగా, ఆ జాబితాలో రామ్మోహన్ నాయుడు చోటు దక్కించుకున్నారు.

శ్రీకాకుళం ఎంపీగా మూడుసార్లు గెలిచిన కింజరాపు రామ్మోహన్ నాయుడు డిసెంబర్ 18, 1987న కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో విజయలక్ష్మి, ఎర్రన్నాయుడు దంపతులకు జన్మించారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యనభ్యసించారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో అండర్ గ్రాడ్యుయేట్ విద్యనభ్యసించారు. లాంగ్ ఐలాండ్ నుంచి ఎంబిఎ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీని అభ్యసించారు. 2012లో తన తండ్రి ఎర్రన్నాయుడు కారు ప్రమాదంలో మరణించడంతో ఆయన రాజకీయ రంగ ప్రవేశం చేశారు. అనంతరం శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సైకిల్‌యాత్ర చేపట్టి ప్రజలకు చేరువయ్యారు. 2014 ఎన్నికల్లో తొలిసారి పోటీ చేసి 1.27 లక్షల మెజార్టీతో వైసిపి అభ్యర్థి రెడ్డి శాంతిపై విజయం సాధించి లోక్‌సభలో అడుగుపెట్టారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వైసిపి ప్రభంజనంలోనూ ఆయన మరోసారి విజయం సాధించి తన పట్టును చాటుకున్నారు. తాజా ఎన్నికల్లో ఏకంగా 3.27 లక్షల మెజార్టీతో మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించారు. సమస్యలపై పూర్తి అవగాహన, అందరితో కలుపుగోలుగా ఉండడం, చొరవ, సమస్యలను లోక్‌సభలో ప్రస్తావించి రాష్ట్ర ప్రజల గొంతుకగా నిలవడం, తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. రైల్వే, హోం వ్యవహారాలు, పశు సంవర్ధక, ఫుడ్ ప్రాసెసింగ్ స్టాండింగ్ కమిటీల్లో సభ్యునిగా పనిచేశారు. పర్యాటక, సాంస్కృతిక మంత్రిత్వశాఖ సంప్రదింపుల కమిటీ, వెనుకబడిన తరగతుల సంక్షేమం, అధికార భాషా శాఖ కమిటీల్లో సభ్యునిగా పనిచేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా, 2020లో ఎంపీగా అతని పనితీరుకు సంసద్ రత్న అవార్డు లభించింది. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శిగానూ పార్టీలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న రామ్మోహన్ నాయుడు

జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు

కేంద్రమంత్రి వర్గంలో పనిచేసే అవకాశం దక్కినందుకు చాలా ఆనందంగా ఉందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈమేరకు ఎక్స్‌లో వీడియో సందేశం విడుదల చేశారు. ఈ ఆనందానికి కారణమైన శ్రీకాకుళం జిల్లా ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నిరంతరం తనకు మార్గనిర్దేశం చేస్తూ ప్రోత్సహిస్తున్న అధినాయకుడు చంద్రబాబు నాయుడు, సోదరభావంతో చూస్తున్న లోకేష్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్రమోడీ, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు బాబాయ్ అచ్చెన్నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. కుటుంబ సభ్యులంతా ఎన్నో త్యాగాలు చేసి తాను మూడుసార్లు గెలవడానికి కారణమయ్యారని గుర్తుచేసుకున్నారు. తాను ఈ స్థాయిలో ఉండడానికి మరో ప్రధాన కారణం జిల్లా ప్రజలేనని, వారందరికీ పాదాభివందనాలు తెలియజేశారు.

తెలుగు ప్రజలు, టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి ఎన్‌డిఎ కూటమికి చారిత్రాత్మక విజయాన్ని అందించారని చెప్పారు. నరేంద్ర మోడీ, చంద్రబాబు నేతృత్వంలో పనిచేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తెలుగు ప్రజలు ఏ కష్టాల్లో ఉన్నా వారి కోసం పనిచేశామన్నారు. వచ్చే ఐదేళ్లలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరుపున శక్తివంచన లేకుండా పనిచేసి అందరికీ న్యాయం చేయడానికి, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కష్టపడతామన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నిలిపి, దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంలో తయారు చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు.

బయోడేటా

పేరు : కింజరాపు రామ్మోహన్ నాయుడు
తల్లిదండ్రులు : విజయలక్ష్మి, ఎర్రన్నాయుడు
జననం : 18 డిసెంబరు, 1987
స్వస్థలం : నిమ్మాడ, కోటబొమ్మాళి మండలం
భార్య : శ్రావ్య
కుమార్తె : నిహిరఅన్వి శివాంకృతి
విద్యార్హత : బిటెక్, ఎంబిఎ
కుటుంబ నేపథ్యం : తండ్రి కీ.శే కింజరాపు ఎర్రన్నాయుడు మూడుసార్లు శ్రీకాకుళం ఎంపీగా ఎన్నికయ్యారు. చిన్నాన్న కింజరాపు అచ్చెన్నాయుడు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు. సోదరి భవానీ రాజమండ్రి సిటీ మాజీ ఎమ్మెల్యే. భార్య శ్రావ్య తండ్రి బండారు సత్యనారాయణమూర్తి అనకాపల్లి జిల్లా మాడుగుల ఎమ్మెల్యే.
రాజకీయ నేపథ్యం : తండ్రి కీ.శే కింజరాపు ఎర్రన్నాయుడు 2012లో మరణానంతరం రాజకీయరంగ ప్రవేశం. 2014, 2019, 2024 ఎన్నికల్లో శ్రీకాకుళం టిడిపి ఎంపీగా విజయం.
పదవులు : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. 16వ లోక్‌సభలో రైల్వే, హోం వ్యవహారాల స్టాండింగ్ కమిటీలు, పర్యాటక, సాంస్కృతిక మంత్రిత్వశాఖ సంప్రదింపుల కమిటీ, వెనుకబడిన తరగతుల సంక్షేమం, అధికార భాషా శాఖ కమిటీలో సభ్యుడు. ఆయన సేవలకు గుర్తింపుగా, 2020లో ఎంపీగా అతని పనితీరుకు సంసద్ రత్న అవార్డు లభించింది.

జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో మెరిసిన విద్యార్థులు



భానుప్రకాష్



సాదీప్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, పలాస, వజ్రపుకొత్తూరు

దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ఐఐటిల్లో ఇంజినీరింగ్ సీట్ల భర్తీకి నిర్వహించిన జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. జాతీయ స్థాయిలో జెఇఇ అడ్వాన్స్ పరీక్షల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. గార మండలం కొర్ని గ్రామానికి చెందిన చమళ్ల భానుప్రకాష్ జాతీయ స్థాయిలో 1246వ ర్యాంకు సాధించాడు. అతని తండ్రి వెంకటేశ్వరరావు పోలాకి మండలం కొల్లివలస ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. తల్లి లత గృహిణి. నరసన్నపేటలో పదోతరగతి వరకు చదువుకున్న భానుప్రకాష్ ఇంటర్మీడియట్ విశాఖలో పూర్తి చేశాడు. మెయిన్స్‌లో చోటు దక్కించుకున్న అతనికి అడ్వాన్స్‌లోనూ జాతీయ స్థాయిలో మంచి ర్యాంకు దక్కింది.

నరసన్నపేటకు చెందిన కోరాడ సాదీప్ 225 మార్కులతో ఆలిండియా ఓపెన్ కేటగిరీ 1265 ర్యాంకును సొంతం చేసుకున్నాడు. జెఇఇ మెయిన్స్‌లో ఓపెన్ కేటగిరీ 1450 ర్యాంకు సాధించాడు. సాదీప్ గుంటూరు భాష్యంలో పది, ఇంటర్మీడియట్ చదివాడు. తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయులు. తండ్రి కోరాడ వైకుంఠరావు నరసన్నపేట మండలం కంబకాయ జెడ్‌పి హైస్కూల్‌లో పనిచేస్తున్నారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులుగా పనిచేస్తున్నారు. తల్లి దుర్గా భవానీ జలుమూరు మండలం అచ్యుతాపురం జెడ్‌పి హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ చేయాలన్నదే తన లక్ష్యమని సాదీప్ తెలిపాడు. సాదీప్ ర్యాంకు సాధించడంపై యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి, జెబిపి రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ అభినందనలు తెలిపారు.

పొందూరు మండలం గోరింటకు చెందిన బాడాన హితేష్ జాతీయ స్థాయిలో 191 మార్కులతో 3092వ ర్యాంకు సాధించాడు. ఒబిసి కేటగిరీలో 542 ర్యాంకులో నిలిచాడు. తండ్రి గోవిందరాజులు ఐతమ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా, తల్లి వనజాక్షి గృహిణి. ఐఐటిలో ఇసిఇ చదవాలన్నదే లక్ష్యమని హితేష్ చెప్పాడు.



పవన్‌సాయి

ఆమదాలవలస మండలం గేదెలవానిపేటకు చెందిన పసగాడ పవన్‌సాయి 177 మార్కులతో ఓపెన్ కేటగిరీలో 4442వ ర్యాంకు, ఒబిసి కేటగిరీలో 837వ ర్యాంకు సాధించాడు. తండ్రి అప్పలరాజు టైలర్‌గా పనిచేస్తుండగా, తల్లి శారద మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలిగా పనిచేస్తోంది.

శ్రీకాకుళం నగరంలోని బాకర్‌సాహెబ్‌పేటకు చెందిన లొద్ది గిరిజాశంకర్ జాతీయ స్థాయిలో 6928వ ర్యాంకు సాధించాడు. ఒబిసి కేటగిరీలో 1436 వర్యాంకు దక్కింది. తండ్రి నీలయ్య మెడికల్ ల్యాబ్ అసిస్టెంటుగా పనిచేస్తుండగా, తల్లి చంద్రకళ గృహిణి. వజ్రపుకొత్తూరు మండలం బాతుపురానికి చెందిన బత్తిన అవినాష్ జాతీయ స్థాయిలో 17262, ఒబిసి కేటగిరీలో 4229వ ర్యాంకు సాధించాడు.

సత్తా చాటిన 'కాకినాడ ఆదిత్య' విద్యార్థులు

జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో కాకినాడ ఆదిత్య విద్యార్థులు సత్తా చాటారు. జాతీయ స్థాయిలో ఉత్తమ స్థానాలు దక్కించుకున్నారు. కళాశాలలో చదువుతున్న భమిడిపాటి స్వర్ణశ్రీ 1941, మాతా ప్రవల్లిక 2795, జరజాన రాజగిరీష్ 2634, జరజాన రాజ్ గౌతం 1240, చింతాడ దివ్య తేజశ్రీ 3700 ర్యాంకు సాధించారు. శ్రీకాకుళం కేంద్రంగా సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యాన వైటిసిలో నిర్వహిస్తున్న ఐఐటి సూపర్-60 బ్యాచ్ విద్యార్థులు సత్తా చాటారు. టి.సాగర్‌కు ఎస్‌సి కేటగిరీలో 2824 ర్యాంకు సాధించి ఐఐటి సీటు దక్కించుకోగలిగాడు. అతనితో పాటు మరో ఏడుగురు విద్యార్థులు ప్రిపరేటరీ ర్యాంకులను సాధించారు. ర్యాంకులు సాధించిన వారిలో డి.పవిత్ర, బి.భావన, ఎస్.నాని, ఎస్.మాళవిక, కె.గుణశ్యామ్, కె.సోమేష్ ఉన్నారు.



అమృత



హితేష్

చక్రధర్ విద్యాసంస్థల ప్రతిభ

అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో చక్రధర్ విద్యాసంస్థల్లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ర్యాంకులు దక్కించుకున్నారు. కె.మోహన దివ్య 2910, బి.జ్ఞానహర్ష 300 (ఎస్‌టి కోటా), పి.కృష్ణ 2602 ర్యాంకులను సాధించారు. వారిని చక్రధర్ విద్యాసంస్థల చైర్మన్ యాళ్ల చక్రధరరావు అభినందించారు.

నారాయణ విద్యార్థుల ప్రతిభ

విశాఖపట్నం నారాయణ విద్యాసంస్థలో చదువుతున్న పలాసకు చెందిన తమ్మినేని అమృత, జి.గుణశేఖర్, కె.సుధాన్వి, పి.హతిన్‌సాయి సత్తా చాటారు. తమ్మినేని అమృత ఒబిసిలో 865 ర్యాంకు సాధించగా, జాతీయ స్థాయిలో కేటగిరీలో 4557, జి.గుణశేఖర్ ఒబిసి కేటగిరీలో 541, జాతీయ స్థాయిలో కేటగిరీలో 4828, కె.సుధాన్వి జాతీయ స్థాయిలో 6455, పొట్నూరు హతిన్ సాయి జాతీయ స్థాయిలో 9454 ర్యాంకులు సాధించారు.


ప్రభుత్వ విద్య బలోపేతానికి చర్యలు

● మెరుగైన బోధనతో ఉత్తమ ఫలితాలు
● అందుబాటులోకి పాఠ్య పుస్తకాలు
● జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ విద్య బలోపేతానికి మరింత కృషి చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈనెల 13 నుంచి కొత్త విద్యా సంవత్సరం ఆరంభమవుతున్న నేపథ్యంలో తరగతుల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు అందుబాటులోకి రావడం, మెరుగైన విద్యా విధానం వల్ల విద్యార్థుల చేరిక సంఖ్య పెరుగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్య అందుతోందని చెప్పారు. మెరుగైన బోధనతో గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలను సాధించినట్లు తెలిపారు. పలు అంశాలపై 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వెల్లడించారు.





ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ విద్య బలోపేతానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

పాఠశాల విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరుగుతున్నాయి. డ్రాపౌట్స్ లేకుండా విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలున్నాయి. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో కార్పొరేట్‌కు ధీటుగా ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యా బోధన ఉంటోంది. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేలా బోధన సాగుతుంది.

పాఠ్య పుస్తకాల సరఫరా ఎంతమేరకు పూర్తి చేశారు?

వేసవి సెలవుల అనంతరం పాఠశాలు పున: ప్రారంభం నాటికి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందేలా ఏర్పాట్లు చేశాం. జిల్లాలో గతేడాది మే చివరి నాటికి పాఠ్య పుస్తకాలు 80 శాతం పైగా చేరగా మండలాలకు పంపించడం పూర్తయింది. ఈసారి జూన్ మొదటి వారానికి 70 శాతం పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. ఏటా ఒకటి నుంచి పదో తరగతి వరకు పుస్తకాల ఇండెంట్‌ను జిల్లాస్థాయి పాఠ్య పుస్తకాల మేనేజరు నుంచి సంబంధిత పబ్లిషర్‌కు పంపేవారు. అలాకాకుండా ఒకటి నుంచి ఏడో తరగతి వరకు మాత్రమే ఇండెంట్ పంపారు. 8 నుంచి 10వ తరగతి వరకు ఆయా మండలాల నుంచి వివరాలు సేకరించి నేరుగా పంపించడం జరుగుతోంది.

విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పాఠ్య పుస్తకాలన్నీ అందిస్తారా?

జిల్లాలోని 30 మండలాల్లో ప్రభుత్వ బడుల్లో ఎనిమిది నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 66,902 మంది ఉన్నారు. ఈ ఏడాది నుంచి సిబిఎస్‌ఇ సిలబస్ అమలు చేయాల్సి ఉంది. ఆ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను నేరుగా మండల కేంద్రాలకు పంపిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు 1,18,022 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికిగానూ 7,37,662 పుస్తకాలు అవసరం కాగా, ప్రస్తుతం జిల్లాకు 3.20 లక్షల పుస్తకాలు చేరాయి. వీటితో పాటు గతంలో మిగిలిన పుస్తకాలు 1,10,737 ఉండడంతో ఇంకా సగానికి పైగా రాలేదు. జిల్లా నుంచి మొత్తం 6,95,984 ప్రింట్ ఆర్డర్ ఇచ్చాం. దశల వారీగా వస్తున్నాయి.

మెగా డిఎస్‌సిని ప్రభుత్వం ప్రకటించే అవకాశమున్న నేపథ్యంలో జిల్లాలో ఖాళీల పరిస్థితి ఎలా ఉంది?

జిల్లావ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల విద్యార్థుల విలీన ప్రక్రియ గతంలో చేపట్టాం. దీనివల్ల జిల్లాలో అనేక పాఠశాలలు సర్దుబాటు అయ్యాయి. కొన్నిచోట్ల విలీన ప్రక్రియ వల్ల పాఠశాలల పునరుద్ధరణపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. రేషనలైజేషన్ వల్ల కొన్నిచోట్ల ఖాళీలను పూరించడమైంది. ప్రభుత్వ మార్గ దర్శకాలకు అనుగుణంగా ఖాళీలను గుర్తించడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలను అనుసరించి ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను గుర్తించనున్నాం.


మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషకాహారంతో కూడిన భోజనాన్ని మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్నాం. మూడు మండలాలు మినహా అన్ని ప్రాంతాల్లో పాఠశాల స్థాయిలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు భోజనం వండుతున్నారు. మూడు మండలాల్లో అక్షయ ఫౌండేషన్ సరఫరా చేస్తోంది. మధ్యాహ్న భోజన వంట కార్మికులకు శిక్షణా కార్యక్రమాలనూ నిర్వహించాం.

వేసవి వినోదం ముగింపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని పెద్ద రెల్లివీధి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న వేసవి వినోదం కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా జెవివి రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, స్వావలంబన కోసం జనవిజ్ఞాన వేదిక పనిచేస్తోందన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించి మూఢ నమ్మకాలకు దూరం చేసేందుకు నిరంతరాయంగా కృషి చేస్తోందన్నారు. జన విజ్ఞాన వేదికలో అన్నిరంగాల ప్రముఖులు, మేధావులు పనిచేస్తున్నారని చెప్పారు. జెవివి జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు మాట్లాడుతూ జెవివి ఆశయాలను విద్యార్థులు సమాజంలోకి తీసుకెళ్లాలన్నారు. వేసవి వినోదంలో భాగంగా చిన్నారులకు పాటలు, పద్యాలు, మేజిక్, డ్రాయింగ్, పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జెవివి జిల్లా కోశాధికారి వి.ఎస్ కుమార్, పెన్షనర్ల సంఘం జిల్లా నాయకులు ఎం.ఆదినారాయణ మూర్తి, సామ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిధర్

అరసవల్లిని దర్శించుకున్న ఎస్‌పిలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని శ్రీకాకుళం, అనకాపల్లి ఎస్‌పి జి.ఆర్ రాధిక, కె.వి మురళీకృష్ణ కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆలయంలో స్వామి వారి సేవల అనంతరం అనివెట్టి మండపంలో వారికి శేష వస్త్రాలను కప్పి చిత్రపటాలను ఆలయ ఇఒ చంద్రశేఖర్ అందజేశారు. వారితో పాటు రూరల్ సిఐ ఎల్ సన్యాసినాయుడు, ఒకటో పట్టణ ఎస్‌ఐ గణేష్ పాల్గొన్నారు.



కష్టం రైతులది.. సొమ్ము దళారులది

ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

ప్రజాశక్తి- నౌపడ

ఉప్పు పూర్తిగా వేసవి పంట, ఎండ తీవ్రతను బట్టి దిగుబడి ఉంటుంది. ప్రస్తుతం పెద్ద మొత్తంలో కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. దీంతో నిల్వలు ఉన్నా ఏం లాభమని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కరోనా మహమ్మరి వల్ల రవాణా లేకపోవడంతో నష్టపోయారు. గతేడాది ధర సక్రమంగా ఉండటంతో ఉప్పు వ్యాపారం సాగింది. ఈ ఏడాది కొనుగోలుపై వ్యాపారులు ఆసక్తి చూపకపోవడంతో పరిస్థితి దయ నీయంగా మారిందని ఉప్పు రైతులు వాపోతున్నారు.

ఒక లారీ వెళ్లని పరిస్థితి

నౌపడ ప్రాంతంలో పండే ఉప్పు రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు పశ్చిమబెంగాల్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. గతంలో నౌపడ, సెలగపేట, మర్రిపాడులో రోజుకు 15 లారీల వరకు ఎగుమతి అయ్యేది. ప్రస్తుతం ఒకటి, రెండు లారీలు వెళ్లడమే కష్టంగా మారింది. నిల్వలు పెరగడంతో వ్యాపారులు సిండికేటుగా మారి ధర తగ్గించేస్తున్నారు. రైతు వద్ద క్వింటాలు బస్తా రూ.120కు కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాల మార్కెట్లో రూ.250 నుంచి రూ.450 వరకు అమ్ముతున్నారు. రైతుల్లో ఎక్కువ మంది అప్పులు చేసి సాగు చేస్తారు. వేసవి సీజన్‌లో అమ్ముతుంటారు. అమ్మగా వచ్చిన డబ్బును బాకీలు తీర్చి కుటుంబ పోషణకు ఉపయోగిస్తారు. కొందరు ధరలు పెరుగుతాయని అమ్మకుండా నిల్వలు ఉంచేసుకున్నారు. ప్రస్తుతం ధరలు బాగా ఉన్నా. కొనుగోలుదారులు సిండికేటుగా మారి తక్కువ ధరకు అడగుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.


ఎగుమతికి సిద్ధంగా ఉన్న 50 కేజీల ఉప్పు బస్తాలు


నౌపడలో రైతులు పండించిన ఉప్పు

పంటను అమ్ముకోవడం మిగిలింది

జిల్లాలో దాదాపు రెండు వేల ఎకరాల్లో నౌపడ, సీతానగరం, మర్రిపాడు, నెలగపేట, యామలపేట తదితర పరిసరాల ప్రాంతాల్లో ఉప్పు పంట సాగువుతోంది. జూన్ నెల నుంచి వర్షాకాలం మొదలవడంతో పండించిన పంటను అమ్ముకోవడమే మిగిలింది. కౌలు, తీత, మోత ఖర్చులు కలిపి ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి అవుతోంది. ఐదు నెలల కిందట క్వింటా రూ.400. పలికేది. ప్రస్తుతం 50 కిలోల బస్తా ధర రూ.70 నుంచి 30 వరకు పలుకుతోంది. లాభదాయకంగా ఉన్నా అనుకున్న స్థాయిలో కొనుగోలుదారులు ముందుకు రాకపోవడంతో క్వింటా రూ.180కే ఇక్కడ రైతులు అమ్ముకుంటున్నారు.

ప్రభుత్వాలు ఆదుకోవాలి

రూ.లక్షలు ఖర్చు చేసి పంటను సాగు చేశాం. వచ్చిన దిగుబడితో అమ్ముదామంటే ధర తగ్గించేస్తున్నారు. ఇష్టారాజ్యంగా సిండికేట్లు ధరను నిర్ణయిస్తున్నారు. మార్కెట్లో ధర ఉన్నా తక్కువకు అడుగుతు న్నారు. దీంతో చేసేది లేక అమ్ముకోవాల్సిన పరిస్థితి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

- ఎల్.జగన్నాయుకులు, సీతానగరం, ఉప్పు రైతు

చంద్రబాబును కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు కూడా ఎన్ఇఆర్‌ని అభినందించారు. ప్రతి విషయాన్నీ గమనించానన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మీరు చూపించిన పోరాట పటిమ, పట్టుదల, పోల్‌మేనేజ్‌మెంట్‌ను ప్రస్తావిస్తూ శభాష్ అంటూ ఎన్ఇఆర్ భుజం తట్టి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.


బాబును అభినందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే


మొక్కను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మనకి చదువుని జ్ఞానాన్ని బోధించే గురువు దైవంతో సమానమని ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి జి.స్వాతి అన్నారు. మండలంలోని సింగపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. 1991-92 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి విద్యార్థులంతా 32 ఏళ్లకు తిరిగి అదే పాఠశాలలో కలుసుకోవడం అపూర్వమైన విషయమన్నారు. చదువుకునే రోజులను నెమరువేసు కుంటూ, కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనడం మరపురాని అనుభూతిని మిగులుస్తుందని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమంలో తాను పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయు లను పూర్వ విద్యార్థులు స్వాతి చేతుల మీదుగా సత్కరించారు.

ఆకట్టుకున్న అశోక్ భారీ కటౌట్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణంలో బస్టాండ్ కూడలి వద్ద టిడిపి అభిమాని శేఖర్ ఎమ్మెల్యే బెందాళం అశోక్ భారీ కటౌట్‌ను ఆదివారం ఏర్పాటు చేసి తన అభిమానాన్ని చాటుకున్నారు. వరసగా మూడో సారి భారీ మెజారిటీతో అఖండ విజయం సాధించిన విషయం విదితమే. ఈ సందర్భంగా దాదాపు 40 అడుగుల భారీ కటౌట్‌ను ఏర్పాటు చేయడంతో అందరినీ ఆకట్టుకుంటుంది.


ఏర్పాటు చేసిన కటౌట్

విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ పోరాటం

జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి గిరిధర్

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్యార్థులను ముందుండి నడిపించి వారి సమస్యలపై పోరాటం చేసేది ఎస్ఎఫ్ఐ మాత్రమేనని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి గొంటి గిరిధర్ అన్నారు. మున్సిపాలిటీలోని చింతాడ పరిధిలోని జిఎల్ ఫంక్షన్ హాల్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతులు ఆదివారం రెండో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా చదువుపై దృష్టిసారించాలని అన్నారు. విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా ముందుండి పోరాడే సంఘం ప్రభుత్వానికి విద్యార్థులకు మధ్య వారధిగా పనిచేసేది ఎస్ఎఫ్ఐ మాత్రమేనని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తుందని అన్నారు. విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంచే విధంగా నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి వీలుగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర శిక్షణా తరగతులు ఏటా నిర్వహిస్తుందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ శిక్షణా తరగతులు శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించడం ఎంతో గర్వకారణమని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.చందు మాట్లాడుతూ 50 ఏళ్లుగా దేశంలో ఎన్నో సమస్యలపై ఎస్ఎఫ్ఐ పోరాటం చేసిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గ విధానాలకు వ్యతిరేకంగా చేసిన పోరాటాలు మరువలేనివని అన్నారు. ప్రభుత్వాలు విద్యార్థులకు అనుగుణంగా నడుచుకొని చట్టాలను రూపొందించాలని, లేనిపక్షంలో పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ప్రమాణస్వీకారం చేసిన వెంటనే మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌ను విడుదల చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ పూర్వ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు సమాజ పరిణామ క్రమం అనే అంశంపై విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్, యు.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


షీల్డ్‌ను అందజేస్తున్న వెంకటేశ్వరరావు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పలాస

మండలంలోని కంబిరిగాం కూడలి జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో సోంపేట మండలం రామయ్యపట్నానికి చెందిన రమేష్ కుమార్ పాణిగ్రహి (40) అక్కడక్కడే మృతి చెందారు. కాశీబుగ్గ పోలీసులు కథనం మేరకు... వ్యక్తి పనుల నిమిత్తం టెక్కలి బైక్‌పై వచ్చారు. పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్తున్నారు. కంబిరిగాం కూడలి వద్ద బైక్ అదుపు తప్పి వంతెన రక్షణ గోడకు ఢీకొట్టడంతో కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడక్కడే మృతి చెందారు. మృతుడు రామయ్యపట్నంలోని ఆలయ పూజారిగా పనిచేస్తున్నారు. మృతుడికి భార్య ప్రత్యూష పాణిగ్రహణి ఉన్నారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి శవపంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ పారినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


రమేష్‌కుమార్ పాణిగ్రహి మృతదేహం


అచ్చెన్నతో అశోక్, గోవిందరావు

అచ్చెన్నను కలిసిన అశోక్, ఎంజిఆర్

ప్రజాశక్తి- పాతపట్నం

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడుని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావులు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ కరెన్సీ నగర్ ఆయన స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈయనతో పాటు టిడిపి నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న కృష్ణ

లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట మిలీనియం లయన్స్ క్లబ్ ద్వారా అందజేస్తున్న సేవలు విస్తృతం చేస్తామని క్లబ్ అధ్యక్షులు సదావుని కృష్ణ అన్నారు. ఈ మేరకు ఓ ప్రయివేటు కార్యాలయంలో ఆదివారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ సేవా కార్యక్రమాలపై చర్చించారు. రానున్న లైనిస్టిక్ అధ్యక్షులుగా రమణ సాహు, కార్యదర్శిగా కె.సాయిరాంలను ఎన్నుకున్నారు. సమావేశంలో కార్యదర్శి వి.నాగరాజు, జెడ్‌సి ఊన్న రంగనాథ్, పోస్టు ప్రెసిడెంట్ బి.బాలకృష్ణ పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న నాయకులు

కొనసాగుతున్న దీక్ష

ప్రజాశక్తి- కవిటి

సమస్యలను పరిష్కరించాలని బెంతు ఒరియా ప్రతినిధులు కోరారు. కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు ఆదివారానికి 165వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా పరిష్కారం కానీ బెంతు ఒరియాల సమస్యకు రాజకీయ పార్టీల అలసత్వమే ప్రధాన కారణమని ఆరోపించారు. ముఖ్యంగా కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో విద్యార్థులు, నిరుద్యోగులు బంగారం లాంటి భవిష్యత్ కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తమకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు. లేదంటే తమ సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.


నినాదాలు చేస్తున్న నాయకులు

దమయంతి మృతి ఉద్యమానికి లోటు

ప్రజాశక్తి- పలాస

ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు టి.దమయంతి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. మండలంలోని సూదికొండ కాలనీలో న్యూ డెమోక్రసీ కార్యాలయం వద్ద భారత కార్మిక సంఘాల సమైక్య జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి అధ్యక్షతన దమయంతి సంతాప సభ ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమంలో దమయంతి సేవలు చిరస్మరణీయమని అన్నారు. విప్లవకారులు రహస్యంగా ఆదుకోవడంలో ఆమె ముందువరుసలో ఉండేద అన్నారు. దివంగత నేత పైల చంద్రమ్మతో పాటుగా ఉద్యమంలో విరివిగా పాల్గొన్నారని గుర్తుచేశారు. కరజాడ ఎంపిటిసిగా ఒకసారి ఎన్నికైందని గుర్తు చేశారు. ముందుగా న్యూడెమోక్రసీ సీనియర్ నాయకులు వంకల పాపయ్య జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అరుణోదయ రామారావు, కోదండరావు, పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి బతకల ఈశ్వరమ్మ, రాపాక చంద్రయ్య, మురిపింటి తాతారావు, మామిడి భీమారావు, మద్దిల వినోద్, బంగ్లా కుమార్, సోమేష్ పాల్గొన్నారు.

టిడిపి విజయోత్సవ ర్యాలీ


కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని ఒంద్రుజోలలో ఎన్ఆర్ బామిడి రాజు ఆధ్వర్యాన ఎమ్మెల్యేగా మామిడి గోవిందరావు గెలుపొందిన సందర్భంగా ఆదివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ఎమ్మెల్యే సతీమణి సుదిస్టన, తనయుడు సాయి గణేష్ పాల్గొన్నారు. వీరికి మేళతాళాలతో గ్రామంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టిడిపి నాయకులు లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు, భైరాగినాయుడులు మాట్లాడుతూ నియోజకవర్గ చరిత్రలో అత్యధిక మెజారిటీ విజయం సాధించడం శుభపరిణామమని అన్నారు. అలాగే చిన్న వయసులోనే కేంద్ర మంత్రిగా అవకాశం దక్కించుకున్న కింజరాపు రామ్మోహన్ నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఖ్యాతిని దేశం నలుమూలల ఇనుమడింప చేసిన కేంద్రమంత్రి సిక్కోలు గొంతుకయ్యారని అన్నారు. కార్యక్రమంలో లోతుగెడ్డ లక్ష్మీనారాయణ నాయుడు, మాతల గాంధీ, రేగేటి కన్నయ్యస్వామి, ఎద్దు దాసునాయుడు, కొయిలాపు శ్రీనివాసరావు, గెడ్డవలస కమలాకర్, అరుబోల దశరథ, పడాల వెంకటకృష్ణ, వాలిపిల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

టిడిపి శ్రేణుల సంబరాలు


టెక్కలి : స్క్రీన్‌పై తిలకిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- టెక్కలి

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేపట్టిన సందర్భంగా టిడిపి నాయకులు ఆదివారం సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ఇందిరాగాంధీ కూడలి వద్ద పెద్ద స్క్రీన్‌ను ఏర్పాటు చేసి రామ్మోహన్ నాయుడు ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని తిలకించారు. అలాగే భగవాన్‌పురంలో టిడిపి మహిళా అధ్యక్షులు మెండ దమయంతి ఆధ్వర్యాన కేంద్ర మాజీ మంత్రి ఎర్రన్నాయుడు విగ్రహానికి పాలాభిషేకం చేపట్టారు. బురగాం, అక్కపువీధిలోనూ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, చాపర గణపతి, హనుమంత రామకృష్ణ, బండ దమయంతి, కోళ్ల లవకుమార్, ప్రీతిష్ చంద్, మట్ట పురుషోత్తం, బెహరా కాళి, దల్లి ప్రసాద్‌రెడ్డి, జీరు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పొందూరు: కేంద్ర మంత్రిగా రామ్మోహన్ నాయుడు ప్రమాణ స్వీకారం చేపట్టిన సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు చిగులపల్లి రామ్మోహనరావు, జిల్లా తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ లోలుగు వెంకట్‌లు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఢిల్లీలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.


పొందూరు : పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మెళియాపుట్టి : మెళియాపుట్టిలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు చిత్రపటాలకు టిడిపి నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మర్రిపాడు-సి, మెళియాపుట్టి, పెద్దపద్మాపురం సర్పంచ్ ప్రతినిధులు రవ్వల గణపతిరావు, రేఖన వాసు, మాలతి శ్రీధర్, మెళియాపుట్టి ఉపసర్పంచ్ మాడుగుల భానోజీరావు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొనారు.


మెళియాపుట్టి : చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి- పలాస

దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన పరీక్షా పేపర్ లీకేజీ అయినట్లు వస్తున్న ప్రచారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.రవి డిమాండ్ చేశారు. కాశీబుగ్గ సిపిఐ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో ఆరుగురు విద్యార్థులు 720 మార్కులకు, 720 మార్కులు రావడం, ఆరుగురు ఒకే ఎగ్జామ్స్ సెంటర్‌కి సంబంధించిన విద్యార్థులు కావడం అనేక అనుమానాలను కలిగిస్తుందన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసినా ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే విచారణ చేపట్టి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య కారణంగా వేలాది మంది ప్రతిభగల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు పవన్, జస్వంత్ ధను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవి

దిగబడిన ఇసుక లారీ

దారిమళ్లిన వాహనాలు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్ సమీపంలో అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై గుంతలలో ఇసుక లారీ దిగబడిపోయింది. శనివారం రాత్రి కురిసిన వర్షానికి అధిక లోడుతో వెళు న్న ఇసుక లారీ ప్రధాన రహదారిపై దిగబడడంతో ఇతర వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఆదివారం ఉదయం శ్రీకాకుళం నుంచి హిరమండలం వైపు వచ్చే ద్విచక్ర వాహనాలు బిటి రహదారి పక్కన ఉన్న కొద్దిపాటి రోడ్డు మీదుగా గమ్యస్థానాలకు చేరుకున్నారు. ఒడిశా నుంచి విశాఖపట్నం వచ్చే ఇసుక వాహనాలన్నీ సరుబుజ్జిలి కూడలి నుంచి పాలకొండ రహదారిలో విశాఖపట్నం చేరుకునే విధంగా దారి మళ్లాయి. గుంతలో ఇరుక్కున్న ఇసుక లారీని బయటకు తీయడానికి మూడు ప్రొక్లెయినర్ వినియోగించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. పక్కన ఉన్న దారిలో వెళ్తున్న మరో వాహనమూ ఆ గుంతలో ఇరుక్కుపోవడంతో రెండు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ నిహార్ పోలీస్ సిబ్బందితో అక్కడకు చేరుకొని. ఒక వాహనాన్ని పక్కకు తొలగించి బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. మాజీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం రోడ్డు నిర్మాణానికి సరుబుజ్జిలి కూడలి వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కానీ, ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో వాహనదారులతో పాటు ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. రాష్ట్రంలో త్వరలో ఏర్పడనున్న కూటమి ప్రభుత్వంతో పాటు నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు సమస్యలు స్వాగతం పలకనున్నాయి.



లారీని బయటకు తీస్తున్న ప్రొక్లెయినర్లు

వ్యర్థాలతో అవస్థలు


రోడ్డు పక్క ఉన్న చెత్తా చెదారం

ప్రజాశక్తి- బూర్జ

కాలుష్య కోరల్లో గ్రామాలు చిక్కుకున్నయి. ఒకవైపు విపరీతమైన దుర్గంధం... మరోవైపు వ్యాప్తి చెందుతున్న వ్యాధులతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు పాలకొండ నుంచి శ్రీకాకుళం ప్రధాన రహదారికి ఇరువైపులా వ్యర్థ పదార్థాలను ఇతర ప్రాంతాల నుంచి లారీలు ద్వారా తీసుకువచ్చే పడేయడం, వాటికి నిప్పంటించడంతో దట్టమైన పొగతో పాటు దుర్గంధం వెదజల్లుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ కాలుష్యంతో నిండిన పొగను పీల్చడంతో రకరకాల శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. చట్టమైన పొగ వ్యాప్తి చెందడంతో శ్రీకాకుళం- పాలకొండ ప్రధాన రహదారి కావడంతో అనునిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, ఈ పొగతో దారి తోచక ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. పొగ వల్ల వాహనదారులకు దారితెలియక వాహనాలు మనసులపై దూసుకొస్తున్నారని పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని అధికారులకు, పాలకులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మండలం లోని కొల్లివలస, ఉప్పెనవలస, వైకుంఠపురం, లచ్చయ్యపేట, అప్పలపేట, కురుంపేట, పెద్దపేట, రామన్నపేట, లక్కుపురం, తుడ్డలి గ్రామాల్లోని డంపింగ్ యార్డులు లేవు. దీంతో గ్రామాల్లో చెత్తా చెదారాలను రోడ్డుకి సమీపంలో వేస్తుండడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పక్కన వ్యర్థపదార్థాలను వేయకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

లోకేష్‌ను కలిసిన రవికుమార్

ఆమదాలవలస : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్‌ను ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉండవల్లిలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు క్లీన్ స్వీప్ చేయడంపై లోకేష్ రవికుమార్‌ను అభినందించారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవికుమార్

రామోజీరావుకి నివాళి


చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న చిత్ర యూనిట్ బృందం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మన ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కుమార్ నాయక్ అధ్యక్షతన ఈనాడు అధినేత రామోజీరావుకి మిరాజ్ చిత్ర యూనిట్ ఘన నివాళ్లర్పించింది. మండలంలోని అక్కుపల్లి శివాలయం ఆవరణలో చిత్ర బృందం రామోజీ చిప్రటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామోజీ ఫిలిం సిటీ స్థాపించి, ఈటివి 13 భాషల్లో ప్రసారం చేస్తూ... సినిమా ప్రపంచానికి అనేక మంది కళాకారులను పరిచయం చేస్తూ, 25 వేల మందికి ప్రత్యక్షంగా, 89 వేల మందికి పరోక్షంగా ఉపాధి కల్పించిన ఘనత రామోజీరావుకే దక్కిందని అన్నారు. కార్యక్రమంలో మిరాజ్ చిత్ర యూనిట్ దర్శకుడు రచయిత విష్ణుదేవ, డిఒపిఎం డి.బి.ఖలీల్, అసిస్టెంట్ డైరెక్టర్ శరత్, నటులు డాక్టర్ కుమార్ నాయక్, రమేష్ యాదవ్, ఎన్.ప్రసాద్, హీరో చరణ్, తామాడ కీర్తన, ఆర్.శృతి, ఎం.స్వాతి, ఎం.మహాలక్ష్మి, ఆశిష్ చోటు, ప్రొడక్షన్ రాజేష్, సిహెచ్.దామోదర పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : ఈనాడు సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావుకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన నివాళ్లర్పించారు. సంస్థ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి సంస్థ చైర్మన్ పి.జగన్మోహనరావు పుష్పాంజలి ఘటించారు. ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ నిక్కు అప్పన్న, నిక్కు హరి సత్యనారాయణ, పి.శ్రీకాంత్, కళ్యాణ చక్రవర్తి, బి.చిన్మయ్‌రావు, నర్సింగరావు, గుణాకరరావు, సతీష్ పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్ : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది